క్లుప్తంగా

విశాలాక్షినగర్ బీవీకేలో ప్రవేశాలు ప్రారంభం

ఆరిలోవ : జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షి నగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రమ శనివారం విలేకరులకు తెలిపారు. కళాశాలలో విశాలమైన క్రీడా మైదానం, లేబొరేటరీ, గ్రంథాలయం, మెరుగైన విద్యా ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

గంజాయితో పట్టుబడిన యువకులపై కేసు

ఆరిలోవ: గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ పదో వార్డు పరిధి డెయిరీఫారం వద్ద శనివారం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులు ట్రాఫిక్ సిగ్నల్ పడినా ఆగకుండా జూ పార్కు వైపు వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని వెంబడించి ఇందిరానగర్ వద్ద పట్టుకొన్నారు. యువకులు గాబరాపడడంతో అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న చిన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులో సుమారు అర కిలో గంజాయి లభించింది. దీంతో వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్లపైనే పార్కింగ్



రోడ్డు మీద నిలిపిన కార్లు

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు వెళ్లే మార్గంలో ప్రముఖ షాపులు ఉన్నాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు నగర వాసులు ఆసక్తి చూపిస్తారు. దీనితో ఆ షాపులకు వచ్చేవాళ్లు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేసి షాపుల్లోకి వెళ్తారు. దీంతో రామ్‌నగర్ నుంచి వాల్తేరు వైపు వెళ్లే ఇతర వాహనాదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. సాయంత్ర సమయంలో అయితే మరింత రద్దీ ఉండడంతో కొన్ని సార్లు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిన ఘటనలూ కూడా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఇతర వాహనాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

అన్నపూర్ణదేవిగా చిన పోలమ్మ



అలంకరణలో చిన పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం : శివాజీపాలెంలోని చిన పోలమాంబ అమ్మవారు శనివారం కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గత ఆరు రోజులుగా అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు



కొలనులోకి దిగుతున్న నీటి ఏనుగులు

జూ.. సందర్శకుల క్యూ

వేసవి సెలవులు కావడంతో ఇందిరాగాంధీ జూ పార్కుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా జూ పార్కును సందర్శించారు. కొంతసేపు వన్యప్రాణులను తిలకించి ఎంజాయ్ చేశారు. ఇక్కడ వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద వారంతా గంటల తరబడి సందడి చేశారు. నీటి ఏనుగులు, తెల్ల పులులు, కోతులు, లవ్ బర్డ్స్, వివిధ రకాల పక్షులు, జిరాఫీలు, అడవి దున్నలు నెమళ్లు, ఏనుగులు సందర్శకులను అలరించాయి. వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను ఫొటోలలో బంధించారు. కొందరు వాటి ఎదురుగా వెళ్లి సెల్ఫీలు దిగారు. దీంతో జూ పార్కు సందడిగా మారింది.

–ఆరిలోవ



పక్షులు జోన్ వద్ద సందర్శకులు



నీటి ఏనుగు ఎన్‌క్లోజరు వద్ద సందర్శకులు



అడవి దున్నలకు ఫొటోలు తీస్తున్న పిల్లలు

పరిపాలన విభాగాల పరిశీలన



కార్యాలయాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలన భవనంలో పనిచేస్తున్న విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునికీకరణ, అవసరమైన మార్పులు చేపట్టడం, మరమ్మతులు, తదితర అంశాలపై సిబ్బంది సూచనలు స్వీకరించారు. ప్రతీ విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్థంగా సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట అధికారులు సాంబమూర్తి, గోపాలకృష్ణ, రమణా రెడ్డి, తులసీరామ్, ఇమాన్ ఉన్నారు.

ఎంవీఐ గోపీకృష్ణకు డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న గోపీకృష్ణ

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగ పరిశోధక విద్యార్థి, శ్రీకాకుళంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పుల్లూరి గోపీకృష్ణకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు కె.టి.బలరామ్ పడాల్ పర్యవేక్షణలో డీజిల్ ఇంజిన్లలో కంపనాలను, ధ్వనిని తగ్గిస్తూ వాటి సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. బయో డీజిల్‌లో అల్యూమినియం ఆక్సైడ్ నానో పార్టికల్స్‌ను జోడించి ఇంధనంగా ఉపయోగించి ఈ పరిశోధన జరిపారు. ఏయూ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఎంవీఐ పి.గోపీకృష్ణను అభినందించారు.

ఇది మా అడ్డా!



పితాపురంకాలనీ సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు



పితాపురం కాలనీ కూరగాయల మార్కెట్ సబ్‌స్టేషన్ లైన్‌లో..

మద్దిలపాలెం: పితాపురంకాలనీలో సర్వీసు రోడ్డు పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. లక్షలాది రూపాయల జీవీఎంసీ నిధులతో సర్వీసు రోడ్డు ఇరుపక్కల సిమెంట్ రోడ్డు వేశారు. ప్రయాణికుల కోసం వేసిన ఆ రోడ్డును ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వ్యాన్లు లోడ్‌లతో పార్కింగ్ చేయడంతో వేసిన సిమెంట్ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో గోతుల మయంగా మారింది. అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు. భారీ వాహనాలు రోడ్డు పక్కగానే నిలపడంతో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయంటున్నారు. అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని వాహనాల రాకపోకలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థికి ప్రీస్కూల్ అత్యంత కీలకం

ఎంవీపీకాలనీ: ప్రతి విద్యార్థికి ప్రీస్కూల్ విద్య అత్యంత కీలకమని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జీవీ ప్రసాదరావు అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో గురుస్థానం ప్లే స్కూల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి పటిష్టమైన పునాది ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లోనే పడుతుందన్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులను ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపించే ముందు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫరూఖీతో పాటు స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా, ప్రిన్సిపాల్ గౌసియా పాల్గొన్నారు.



నూతనశాఖను ప్రారంభిస్తున్న ఏసీపీ ప్రసాదరావు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఘనంగా సహస్రనామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



తులసీదళార్చనలో సిరులతల్లి

వెలుగుతున్న విద్యుత్ దీపాలు

సాక్షి ఎఫెక్ట్..



ప్రగతినగర్‌లో వెలుగుతున్న విద్యుత్ దీపం

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు పరిధి ప్రగతి నగర్‌లో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. ఇక్కడ ఓ వీధిలో 26/ఎ/3/1 నంబరు గల విద్యుత్ స్తంభం నుంచి వరుసగా పలు విద్యుత్ దీపాలు వెలగలేదు. దీంతో ఈ నెల 17న 'విద్యుత్ దీపాలు వెలిగించరూ' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. శనివారం ఆ కాలనీలో వెలగని విద్యుత్ దీపాలను పరిశీలించారు. వెలగని బల్బులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చారు. ఇప్పుడు రాత్రి వేళల్లో ఆ కాలనీలో వెలుగు విరజిమ్మతున్నాయి. దీంతో స్థానికులు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: విశాఖ వేదికగా జూన్ 2న ఎంబీఏ, పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోయే మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారితోపాటు చివరి ఏడాది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు https://mat.aima.in వెబ్ సైట్‌ను సందర్శించి ఈ నెల 28తేదీ లోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి కృష్ణా కాలనీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక మంగల వీధికి చెందిన ఏనుగుతల శ్రీనివాసరావు(54) విశాఖలోని ఓ సెలూన్‌లో పని చేస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహనంపై విశాఖ నుంచి వస్తుండగా అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుంతీ మాధవ స్వామి చందనోత్సవం నేడు

పద్మనాభం : పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవం నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంతీ మాధవ స్వామిని అలంకరించడానికి అవసరమయ్యే చందనాన్ని సమకూర్చారు. కుంతీ మాధవ స్వామిని శనివారం రాత్రి పది గంటలకు ఆలయ అర్చక స్వాములు చందనంతో అలంకరిస్తారు. ఆదివారం ఉదయం ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం ఏడు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు. రెండు రోజుల వరకు కుంతీ మాధవ స్వామి చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ లోపలి భాగాన్ని, రాజగోపురం ముందు భాగాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. కుంతీ మాధవ స్వామి ఆలయం ముందు భాగంలో అరటి చెట్లతో అలంకరించారు.



కుంతీ మాధవ స్వామి విగ్రహం

జూ పార్కు వద్ద బస్ బే నిర్మాణం

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కు వద్ద జీవీఎంసీ అధికారులు బస్ బే నిర్మిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని జూ పార్కు ముందు ఖాళీ స్థలంలో ఈ బస్ బే నిర్మాణ పనులు చురుగ్గా చేపడుతున్నారు. జూ పార్కు ఏర్పాటు చేసి సుమారు 50 సంవత్సరాలు అవుతోంది. కొన్నేళ్ల క్రితం జూ పార్కు వద్ద నగరం నుంచి అటుగా వెళ్లే బస్సులు ఆగడానికి బస్టాప్, షెల్టర్ ఏర్పాటు చేశారు. కానీ మధురవాడ, ఎండాడ నుంచి జూ పార్కు వైపు వెళ్లే వారి కోసం మాత్రం ఇక్కడ బస్టాప్ ఏర్పాటు చేయలేదు. సందర్శకుల రిక్వెస్ట్ మేరకు మాత్రమే జూ ప్రధాన ద్వారం వద్ద కొన్ని సిటీ బస్సులు ఆగుతుండేవి. కొందరు డ్రైవర్లు ఆపకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సందర్శకులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ సమస్యపై జూ క్యూరేటర్ నందనీ సలారియా ఇటీవల జీవీఎంసీ అధికారులకు లేఖ రాశారు. బస్ బే నిర్మించాలని కోరారు. దీనికి స్పందించిన జీవీఎంసీ అధికారులు సందర్శకుల సౌలభ్యం కోసం బస్ బే నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో జూ సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జూ పార్కు వద్ద జరుగుతున్న బస్ బే నిర్మాణ పనులు

కల్యాణం.. కమనీయం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం గోదా, పద్మావతి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు